క్లుప్తంగా

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



భీమవరంలో కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: తుపాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు జెఎన్‌వీ గోపాలన్ శుక్రవారం కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. పంట నష్టపోయిన ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం, పంట బీమాతోపాటు దాళ్వాకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. అలాగే ఎరువులు, పురుగుమందులు 50 శాతం రాయితీపై ఇవ్వాలని నష్టపరిహారం వాస్తవ సాగుదారులైన కౌలురైతులకే అందించాలని కోరారు.

కూలిన రైల్వేస్టేషన్ ప్రహరీ



ఉండి రైల్వే స్టేషన్‌లో కూలిన ప్రహరీ

ఉండి: ఆధునికీకరించి ముచ్చటగా మూడేళ్లు కాకముందే ఉండి రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫారమ్ ప్రహరీ కూలిపోవడంపై రైల్వే స్టేషన్ నాణ్యతా ప్రమాణాలపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. తుపాను కారణంగా కురిసిన వర్షాల సమయంలో గోడ కూలిందని రైల్వే స్టేషన్ అధికారులు చెబుతున్నా గోడకు ఎలాంటి పిల్లర్స్ లేకపోవడం కూడా ఓ కారణంగా తెలుస్తుంది. గతంలో కూడా రెండో ప్లాట్‌ఫారమ్‌పై కొంతమేర ప్రహరీ పడిపోవం తో ప్రయాణికులు అధికారుల దృష్టికి తేవడంతో దానిని పునర్నిర్మించారు. ప్రహరీ కూలిపోవడంపై ఉన్నతాధికారులకు, భీమవరంలోని రైల్వే నిర్మాణ కార్యాలయానికి సమాచారం అందించినట్లు స్టేషన్ అధికారులు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



ప్రకాశంచౌక్ సెంటర్‌లో దీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం: అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను చేసి బాధితులకు పూర్తి న్యాయం చేయాలని లేనిపక్షంలో దశలవారీ ఉద్యమాలు నిర్వహిస్తామని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రకాశంచౌక్ సెంటర్‌లో చేపట్టిన నిరాహార దీక్షా శిబిరం వద్ద ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితుల న్యాయపరమైన డిమాండ్ల సాధనలో భాగంగా దశల వారి పోరాటాలు నిర్వహిస్తామని దీనిలో భాగంగా ఈ నెల 18న కలెక్టరేట్ వద్ద ధర్నా, 28, 29వ తేదీల్లో విజయవాడలో 30 గంటల నిరసన దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, కె.గోపాలకృష్ణ, ఎం.సీతారాంప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందించడమే లక్ష్యం

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతీ పేదవాడికి వైద్యం అందించాలన్న లక్ష్యంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని, అయితే, కొందరు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. శుక్రవారం కొడమంచిలి -02లో నిర్వహించాల్సిన వైద్య శిబిరం కొడమంచిలి -01లో నిర్వహించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వల్లూరు పీహెచ్‌సీ వైద్యుని అడిగితే సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. దీంతో పాటు క్యాంపు జరుగుతుండగానే వదిలేసి వెళ్లపోయారని, ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ బీమా పథకం కుటుంబంలో పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబానికి ఆసరాగా వైఎస్సార్ నిలుస్తుందని సర్పంచ్ గంటా సత్యనారాయణ చెప్పారు. మండలంలోని వాలమర్రు గ్రామ సచివాలయంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన వేండ్ర మల్లన్న కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.4.90 లక్షలు చెక్కును మల్లన్న కుటుంబ సభ్యులకు శుక్రవారం సర్పంచ్ సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా పాలన



ఉండి: వాండ్రంలో ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



భీమవరం (ప్రకాశం చౌక్): 16వ వార్డులో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

భీమవరం అర్బన్: మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని తలచి మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికే ఎక్కువ సంక్షేమ పథకాలు కేటాయిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహారావు అన్నారు. మండలంలోని నాగిడిపాలెం గ్రామంలో శుక్రవారం ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహారావు మాట్లాడుతూ మహిళలకు డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ, ఇంటి స్థలం మహిళ పేరున పట్టా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలు 40 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసున్న వారికి రూ.18,750, కాపు మహిళలైతే రూ.15 వేలు, తల్లి పేరున అమ్మ ఒడి ద్వారా రూ.15 వేలు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు విలేజ్ మార్టులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉభయ గోదావరి జిల్లాల సేవాదళ్ కన్వీనర్ చినిమిల్లి వెంకట్రాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, సర్పంచ్ నాగిడి నారాయణ స్వామి, నాగిడి నాగరాజు, తిరుమాని సహదేవుడు, నాగిడి లక్ష్మణ స్వామి, తిరుమాని ధర్మరాజు, నాగిడి సత్యనారాయణ, కొల్లాటి భాస్కరరావు, తిరుమాని విమలా దేవి, కొట్టి కుటుంబరావు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని ఏనాడూ చూడలేదని ప్రతి ఒక్కరూ అంటున్నారని జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ మహంకాళి, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని వాండ్రంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్కే ఆంజనేయరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలు పొందిన లబ్ధి వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ప్రారంభించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంక్షేమ పాలన, ప్రజాసంక్షేమానికి చిరునామాగా మన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టారని అన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు దాసరి వెంకటకృష్ణ ,గ్రామ పార్టీ అధ్యక్షుడు రంగరాజు, ఆర్కే, సచివాలయ కన్వీనర్‌లు మాదాసు విజయ, కోనాల మహంకాళి, బుద్ధరాజు సుబ్బరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఏసు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం పట్టణంలో

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక 16వ వార్డులో వార్డు ఇన్‌చార్జి నందమూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి శుక్రవారం నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు వార్డులో ర్యాలీ నిర్వహించి పార్టీ జెండా ఆవిష్కరించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలో ప్రజలకు వివరించారు. అనంతరం జరిగిన సభలో పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పాలన నూటికి నూరు శాతం అందించారన్నారు. పేదల కోసం లక్షల కోట్లు ఖర్చు చేసి వారిని అన్నింటా అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రాజు, గంటా సుందర్ కుమార్, కందికట్ల ఎడ్వర్డ్, పాలపర్తి జోనా, రేవూరి గోగురాజు, కానుబోయిన వెంకటరమణ, పాలవెల్లి మంగ, అల్లూరి నాగవల్లి, వేండ్ర విజయదుర్గ, చెల్లబోయిన సూర్యప్రకాష్, మద్దుల కరుణకుమార్, నల్లం రాంబాబు, బొత్స ధర్మ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామానికి చెందిన సోడదాసి గాబ్రియేలు(72) ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. వీఆర్వో శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాళ్ళకూరులోని వెంకటాపురం ప్రాంతంలో పంట కాలవలో పూడికతీత పనులు చేస్తున్న గాబ్రియేలుకు 12 గంటల సమయంలో చాతిలో నొప్పి రావడంతో కాలువలో నుంచి గట్టు పైకి వచ్చి అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటనపై ఉపాధి కూలీలు అధికారులకు సమాచారం అందించడంతో టెక్నికల్ అసిస్టెంట్ బి.రమేష్ బాబు, ఎంపీడీఓ ఎంఎస్ ప్రభాకరరావు వీఆర్వో శివనాగరాజు, కార్యదర్శి సునీల్ రాజు, సర్పంచ్ సాదు శ్రీదేవి శ్రీనివాస్‌లతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సర్పంచ్ మృతుడి కుటుంబ సభ్యులకు తక్షణ సహాయంగా రూ.5,000, దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ మరో రూ.5,000, సహాయం అందించారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

భీమవరం: భీమవరం కోర్టుల్లో శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని భీమవరం మండలన్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, 3వ అదనపు జిల్లా జడ్జి పి.శ్రీసత్యాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్‌కు వచ్చే కక్షదారులకు న్యాయవాదులు, పోలీస్ అధికారులు సహకరించాలన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, సివిల్, కుటుంబతగాదా కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమాకు సంబంధించిన కేసులు ఉభయ కక్షిదారుల ఆమోదం మేరకు రాజీ చేయనున్నట్లు శ్రీసత్యాదేవి తెలిపారు.

ప్రభుత్వం రైతులను ఆదుకుంటుంది



కాళ్ల: ఏలూరుపాడు గ్రామంలో నీటిలో మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న పీవీఎల్



ఆకివీడు: పునరావాస కేంద్రంలో బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న పీవీఎల్

కాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటారని రైతులు ఆందోళన చెందవద్దని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు రైతులకు భరోసా ఇచ్చారు. కాళ్ల మండలంలో డీసీసీబీ చైర్మన్ నరసింహ రాజు శుక్రవారం పర్యటించారు. ప్రధానంగా ఏలూరుపాడు గ్రామంలో ఆయన పర్యటించి ముంపు గురైన పంట పొలాలను క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుపాను రైతులకు నష్టాలు మిగిల్చిందన్నారు. తుపాను ప్రభావం వల్ల దెబ్బతిన్న పంటల్లోని ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. మురుగు కాలువల అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన చోట జేసీబీలు ఏర్పాటు చేసి నీటిని మళ్లించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు చిన్నాపరపు రాంబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రుద్రరాజు రామకృష్ణంరాజు, జిల్లా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాదరాజు, మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, మంతెన రామకృష్ణంరాజు, దాట్ల బాపిరాజు, పడమట సుబ్బయ్య, దాట్ల రామభద్ర రాజు, బండ్రెడ్డి ఆది, పడమట సతీష్, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నది ఆదుకునే ప్రభుత్వం

ఆకివీడు: బాధితుల్ని ఆదుకోవడంలో, అండగా ఉండటంలో సీఎం జగన్ ప్రభుత్వం ముందంజలో ఉందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మిచాంగ్ తుపాను తాకిడికి కురిసిన కుంభవృష్టి వర్షానికి అతలాకుతలమై, పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధితులను శుక్రవారం పీవీఎల్, నాయకులు పరామర్శించారు. ప్రభుత్వం తరపున బాధిత కుంటుంబానికి రూ.వెయ్యి నగదుతో పాటు 25 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, మంచినూనె, ఉల్లిపాయలు, చింతపండు, బంగాళాదుంపల్ని అందజేశారు. పునరావాస కేంద్రాల్లో 88 మంది కుంటుంబాలకు నిత్యవసర వస్తువుల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, పడాల శ్రీనివాసరెడ్డి, అంబటి రమేష్, శిరపు శ్రీనివాస్, వంగా జ్యోత్స్న, కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, అందేరాజబాబు, మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, ఎండీ.జక్కీ, ఎండీ.ఆలీ, తిప్పా దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

బీడీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం



బీడీఎస్ విద్యార్థి పవన్‌కల్యాణ్ తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రతిభ ఉండి పేదరికంలో ఉన్న విద్యార్థులకు దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి అన్నారు. స్థానిక విష్ణు కళాశాలలో బీడీఎస్ విద్యనభ్యసిస్తున్న సత్తుపల్లికి చెందిన అచ్చిరాజు పవన్‌కల్యాణ్‌కు దాతల సహకారంతో సమకూర్చిన రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని శుక్రవారం చిన్మయప్రభ కార్యాలయంలో అందజేశారు. పవన్‌కల్యాణ్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నందున డాక్టర్ రాయసం నరేష్ కుమార్ రూ.10 వేలు, తుమ్మలపల్లి శివ రూ.5 వేలు, బొండా సుబ్బారావు రూ. 2 వేలు, లీలాకృష్ణ రూ. 3 వేలు సమకూర్చారన్నారు. ఈ మొత్తాన్ని విద్యార్థి తల్లిదండ్రులు అచ్చిరాజు వరలక్ష్మి, రామకృష్ణ దంపతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొండా సుబ్బారావు, కొండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని ధర్నా



గాంధీనగర్ ఎస్టీ కాలనీ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక ఏడో వార్డు గాంధీనగర్ ఎస్టీ కాలనీలో మరుగుదొడ్లు సమస్య పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించి సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఎం .వైకుంఠరావు మాట్లాడుతూ ఎస్టీ కాలనీ ఏర్పడి 30 ఏళ్లు గడిచినా అక్కడి ప్రజలకు వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడం దారుణమన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 100 కుటుంబాలు నివాసముంటున్నాయని వారికి వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయడంతోపాటు కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని వైకుంఠరావు కోరారు. కార్యక్రమంలో చెల్లబోయిన వెంకటేశ్వరరావు, గంధం రోజా, గంధం రమాదేవి, ఎం.సావిత్రమ్మ పాల్గొన్నారు.

ధాన్యం ఒబ్బిడి చేస్తూ రైతులు బిజీబిజీ



వరిచేలల్లో కోసిన వరిపనలను పడవపై రోడ్డుకు చేరవేస్తున్న రైతులు



ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఆరుగాలం కష్టపడిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. మిచాంగ్ తుపాను వల్ల చేలల్లో మోకాళ్లలోతు నీటిలో మునిగిపోయిన వరి చేలను గత రెండు రోజులుగా వాతావరణం తెరిపించడంతో చేతికి అంది వచ్చిన నాలుగు గింజలను ఒడ్డుకు చేర్చేందుకు రైతులు చేలల్లోంచి పడవ సాయంతో ఒడ్డుకు చేర్చుతున్నారు. మండలంలోని సుమారు 7 వేల 500 ఎకరాలలో సార్వా సాగు చేపట్టారు. తుఫాన్ కంటే ముందు చేలన్నీ కోత దశలో పక్వానికి రావడంతో గునుపూడి, యనమదుర్రు గ్రామాలలో వరి కోత యంత్రాలతో రైతులు ధాన్యం ఒబ్బిడి చేశారు.ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో ఎకరానికి 30 నుంచి 40 బస్తాల మధ్య దిగుబడి రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో మిచాంగ్ తుపాను రావడంతో రైతుల సార్వాపై ఆశలన్నీ గల్లంతయ్యాయి. కొన్ని చోట్ల వరిని కోసి పనలను పడవలంపై ఒడ్డుకు చేర్చి ఆరబెట్టి ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్నారు. కొన్ని చోట్ల ధాన్యపు రాశులను ఎండకు ఆరబెడుతున్నారు. మరికొన్ని చోట్ల తడిచిన ధాన్యపు రాశులపై గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పునీటిని పిచికారీ చేస్తున్నారు. చేలల్లో వరద నీటిని బయటకు పంపించేందుకు ఆయిల్ ఇంజిన్లతో తోడుతూ రైతులు ఒబ్బిడి చేసేందుకు నానా పాట్లు పాడుతున్నారు.

బంగారం సమర్పణ



భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన ఎం.ప్రత్యూష ఎనిమిది గ్రాముల బంగారం సమర్పించారు. శుక్రవారం కుటుంబం సమేతంగా మావుళ్లమ్మ ఆలయానికి విచ్చేసిన ప్రత్యూష ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యూషను సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు.

ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య

ఆకివీడు: తుపాను తాకిడికి తడిసి, రంగుమారిన, ఎలాంటి ధాన్యాన్నైనా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య చెప్పారు. స్థానిక ఏడీఏ కార్యాలయం వద్ద సలహా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంభవృష్టి వర్షానికి చేలల్లో నీరు నిలబడి ఉందని, రైతులు బయటకు తోడుకునేందుకు ప్రభుత్వం డీజిల్ సౌకర్యం కల్పించిందని చెప్పారు. తుపాను బాధితులైన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టి తేమ శాతం తగ్గించే ప్రయత్నాలు చేయాలన్నారు. చనిపోయిన పశువులకు బీమా సొమ్ము వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పంట బోదెల్లో గుర్రపుడెక్క తొలగింపు పనుల్ని ఉపాధి హామీలో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ ముంపు నీరు బయటకువెళ్లిపోయిన తరువాత నష్టం అంచనాలు వేస్తామన్నారు. సమావేశంలో వ్యవసాయాధికారిణి ఏ.ప్రియాంక, మాదివాడ ఆర్బీకే చైర్మన్ కేశిరెడ్డి దుర్గారావు, మండల పరిషత్ ఏఓ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

కంగారుపెడుతున్న యనమదుర్రు డ్రెయిన్

ఉండి: మండలంలోని యండగండి గ్రామ పరిధిలో యనమదుర్రు మేజర్ డ్రెయిన్‌లో ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతికి నీటిమట్టం పెరుగుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రానికి యండగండి, ఎస్.కొందేపాడు మధ్యలో ఉండే పాతవంతెన ముంపునకు గురైంది.ప్రస్తుతం డ్రెయిన్‌లో నీటి మట్టం 34 అడుగులు నీటి మట్టం ఉందని రాత్రికి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్రెయిన్ గట్లను పరిశీలిస్తున్నామని, ఎక్కడా ఇబ్బందికరమైన పరిస్థితులు లేవని అధికారులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని మహదేవపట్నంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం ఉదయం దాడి చేశారు. ఈ దాడిలో 13 మందిని అదుపులోకి తీసుకుని, రూ.97 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఏ సూర్యనారాయణ తెలిపారు.

క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యం



ఆడుదాం ఆంధ్ర కిట్స్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం ముదునూరి తన క్యాంపు కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని 1,2 వార్డులకు సంబంధించిన యువకులకు ఆడుదాం..ఆంధ్రా కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 50 రోజుల పాటు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ జరిగే ఈ క్రీడా సంబరాలు ప్రత్యేకమైనవన్నారు. గతంలో యువక్రీడాకారులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమం రాష్ట్రంలో జరగలేదన్నారు. యువతకు అవసరమైన క్రీడా సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్ సోమరాజు దుర్గాభవానీ, కావలి నాని, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ పాల్గొన్నారు.

8 దేవాలయాల ట్రస్టుబోర్డుల ఏర్పాటుకు ఉత్తర్వులు

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలోని ఎనిమిది దేవాలయాలకు ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసుకునే విధంగా జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి వెంకట సుబ్బారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలోని ఆకివీడులోని మదన గోపాల స్వామి, చినకాపవరంలోని బుచ్చి వేంకటేశ్వరస్వామి ఆలయం, పెదకాపవరంలోని కూర్మనాథ వేణుగోపాలస్వామి ఆలయం, అయిభీమవరంలోని మదన గోపాల స్వామి దేవాలయం, పాలకోడేరు మండలం శృంగవృక్షంలోని మల్లేశ్వరస్వామి ఆలయం , ఉండి మండలంలోని కలిగొట్లలోని భీమేశ్వరస్వామి ఆలయం, ఆరేడులోని శ్రీకేశవ స్వామి దేవస్థానంతో పాటు మరో ఆలయానికి ధర్మ కర్తల మండలి నియామకం కోసం ఉత్తర్వులు జారీ చేశారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

మొగల్తూరు: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సర్పంచ్ పడవల మేరీ సూచించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశంలో ఆమె వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో పులపర్తి వెంకటేశ్వరరావు, కవురు శ్రీనివాస్, పడవల సత్యనారాయణ, తిరుమాని స్వామి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

యలమంచిలి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. గుంపర్రు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి మిచాంగ్ తుపానువల్ల దెబ్బతిన్న వరి చేలను ఆయన పరిశీలించారు. యడ్ల తాతాజీ, రావూరి వెంకటరమణ బుజ్జి, తుంగ అమూల్య, అనిశెట్టి మల్లిక పాల్గొన్నారు.